ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

బుధవారం 9 జూలై 2025

స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

- 11 ఎంపీటీసీ స్థానాలు ఖరారు,
- 2 గ్రామ పంచాయతీల మార్పు
- ఎంపీటీసీ స్థానాల డీలిమిటేషన్‌పై డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల



ఎంపీడీవో ఆఫీసు వద్ద నోటీస్ బోర్డు పై అంటిస్తున్న ఉద్యోగులు

మంథని/మంథనిరూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకోసం అధికారయంత్రాగం సమాయత్తమవుతోంది. మండలంలో ఎంపీటీసీ స్థానాల విభజన, జనాభా పై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం అధికారులు డిలిమిటేషన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పబ్లిష్ చేశారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల పరిధిలో 11 ఎంపీటీసీ స్థానాల పరిధిని, వాటిలో ఉన్న ఎస్టీ, ఎస్సీ, ఇతరుల జనభా వివరాలతో కూడిన జాబితాను విడుదల చేశారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 38,690 మంది జనాభా ఉండగా వీరిలో మహిళలు 19,417 మంది, పురుషులు 19,273 మంది ఉన్నారు. మండలంలో మొత్తం 35,055 మందితో ఓటర్లు ఉన్నారు. ఎంపీటీసీ ఎన్నికల కోసం 67 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పై అభ్యంతరాలంటే ఈనెల 8, 9వ తేదీల్లో తెలుపాలని సూచించారు. ఈనెల 10, 11 తేదీల్లో అభ్యంతరాలను పరిశీలన చేస్తారు. ఈనెల 12వ తేదీన మార్పుల ఎంపీటీసీ స్థానాలు, కులాల ప్రతిపాదికన జనాభా జాబితాకు ఆమోదిస్తామని ఎంపీడీవో శశికళ తెలిపారు.

కన్నాల పరిధిలో మల్లెపల్లి, సూరయ్యపల్లిలో రచ్చపల్లి జీపీల మార్పు..

కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఉన్న రచ్చపల్లి గ్రామ పంచాయతీ సింగరేణి గని విస్తరణలో భాగంగా నిర్వాసిత గ్రామంగా తరలించి బిట్టుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేయడంతో ఈ గ్రామ పంచాయతీని సూరయ్యపల్లి ఎంపీటీసీ స్థానంలోకి మార్పు చేశారు. దీంతో కన్నాల ఎంపీటీసీ స్థానంలో ఓటర్ల సంఖ్య తగ్గడంతో గతంలో ఉప్పట్ల ఎంపీటీసీ పరిధిలో ఉన్న మల్లెపల్లి గ్రామ పంచాయతీని కన్నాల ఎంపీటీసీ పరిధిలోకి మార్చారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన డైరెక్టర్(పా)



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డైరెక్టర్(పా) గౌతం

గోదావరిఖని, జూలై 8(ఆంధ్రజ్యోతి): సింగ రేణి డైరెక్టర్(పా) గౌతం పొట్రు మంగళవారం గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏమైన సమస్యలు ఉన్నాయా అని కార్మికులను అడిగారు. ఆసుపత్రిలో గుండెకు సంబంధించిన క్యాత్ ల్యాబ్ వివరాలపై సిబ్బందిని అడిగారు. జనరల్‌సర్జన్, ఈఎన్‌టీ సర్జన్ల కొరతను తీరుస్తామని, త్వరలో డాక్టర్లను నియమిస్తామన్నారు. తనిఖీల్లో డైరెక్టర్(పా)వెంట ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఏసీఎంఓ డాక్టర్ అంబిక, అధికారులు రవీందర్‌రెడ్డి, రవి ప్రసాద్, జితేందర్‌సింగ్, వీరారెడ్డి ఉన్నారు.

నేడే సార్వత్రిక సమ్మె

- జాతీయ, విప్లవ కార్మిక సంఘాల జేఏసీల మద్దతు
- సమ్మెకు దూరమని ప్రకటించిన బీఎంఎస్
- సింగరేణికి నష్టమంటున్న యాజమాన్యం



గోదావరిఖని, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ నాలుగు జాతీయ కార్మిక సంఘాలు దేశ వ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థల్లో బుధవారం సమ్మెకు పిలుపునిచ్చాయి. కార్మిక చట్టాల రద్దు, నాలుగు కొత్త లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టడాన్ని జాతీయ కార్మిక సంఘాలు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్‌లు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దీనికి తోడు 8గంటల పని దినాలను 10గంటలకు పెంచుతూ తీసుకువచ్చిన జీవోను కూడా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సింగరేణిలో ఈ సమ్మెను విజయ వంతం చేసేందుకు నాలుగు జాతీయ కార్మిక సంఘాలు తీవ్రంగా కృషి చేశాయి. కార్మికవర్గాన్ని బుధవారం జరిగే సమ్మెకు సంసిద్ధం చేశాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక చట్టాలకు కార్మికవర్గానికి, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు జరిగే నష్టాన్ని వివరించాయి. సింగరేణిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ), సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీ యూసీ), సింగరేణి కాలరీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ), తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్మిక సంఘాల జేఏసీగా ఏర్పడి సమ్మెకు కార్మికులను సంసిద్ధం చేశాయి. మరో జాతీయ కార్మిక సంఘం సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్‌ఎంఎస్)తో పాటు విప్లవ కార్మిక సంఘాలైన గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ), గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం శ్రామికశక్తి (ఏఐఎఫ్ టీయూ), టీఎ న్‌టీయూసీ తదితర కార్మిక సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సమ్మె కోసం విస్తృత ప్రచారం చేశాయి. సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎం ఎస్) మాత్రం సమ్మెకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించింది.

సింగరేణి యాజమాన్యం ఈ సమ్మె వల్ల సంస్థకు, కార్మికులకు ఉత్పత్తి, ఉత్పాదకతలకు జరిగే నష్టాన్ని వివరిస్తూ బుధవారం జరిగే సమ్మెకు సింగరేణి కార్మికవర్గం దూరంగా ఉండాలని కోరింది. ఒక రోజు సమ్మె చేస్తే 1.92లక్షల టన్నుల ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, ఇది వార్షిక ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రభావం చూపుతుందని యాజమాన్యం చెబుతున్నది. దీనికి తోడు కార్మికవర్గం కూడా రూ.13.7కోట్ల వేతనాలను ఒక రోజులో కోల్పోతారని చెబుతున్నది. మొత్తం సంస్థకు కలిగే ఉత్పత్తి నష్టం సుమారు రూ.76కోట్లు ఉంటుందని వివరించింది. సమ్మె డిమాండ్లలో సింగరేణికి సంబంధించింది, రాష్ట్రప్రభుత్వ పరిధిలో నిర్ణయిం చాల్సి అంశాలు ఏమి లేని కారణంగా సమ్మె వల్ల సంస్థకు నష్టం జరగడం మినహా కార్మికుల సమస్యల పరిష్కారానికి మార్గాలు లేవని స్పష్టం చేసింది. అయితే సింగరేణి కార్మికవర్గంలో సమ్మెకు సంసిద్ధత కనిపి స్తున్నది. సింగరేణిలోని 38వేల మంది కార్మికులు, ఉద్యో గులతోపాటు కాంట్రాక్టు కార్మికులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొనే

(మిగతా 8వ పేజీలో)

పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు ⑦

- ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు సరిపోక ఇబ్బందులు
- సరైన సమయానికి వైద్యం అందక మృత్యువాత

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరలోనే గ్రామాల అభివృద్ధికి కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. హన్మాండ్లపల్లి, కందునూరిపల్లి, కొత్తపేట, నారాయణపూర్, కొదురుపాక, దేవునిపల్లి తదితర గ్రామాలలో మంగళవారం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హాల్, బోర్ వెల్ తదితర పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేసి ముగ్గులు పోశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ సమయంలో తాము ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, ఇంకా మూడున్నరేళ్ళ సమయం ఉందని, అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే బాధ్యత తనదన్నారు. పదేళ్ళలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ఒక్క మేలు చేయలేదన్నారు. ఎనభై శాతం మందికి ఉచిత విద్యుత్ అమల వుతుందని, మూడు పూటల సన్న బియ్యం తినే భాగ్యం సీఎం రేవంత్‌రెడ్డి వల్ల సాధ్యమైందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, దామోదర్ రావు, తిరుపతి, కల్లెపల్లి జానీ, చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, రమేష్, ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, పీఆర్ఏఈ సచిన్, పీహెచ్‌సీ వైద్యులు ఉదయకుమార్, స్వప్న తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను బోధించాలి

రాష్ట్ర ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి, పరిశీలకులు రమణారావు

సుల్తానాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆయా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు అర్థంఅయ్యే విధంగా పాఠ్యాంశాలను బోధించాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి, పరిశీలకులు రమణారావు అధ్యాపకులకు సూచించారు. మంగళవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో విద్యార్థులసంఖ్య పెంచడం, డ్రాప్‌అవుట్లను తగ్గించేందుకు ఆకడమిక్ మానిటరింగ్ చేయడానికి ఇంటర్మీడియట్ కమిషనర్ రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలకులను నియమించారని ఇందులో భాగంగా తాను జిల్లాల్లో పర్యటిస్తూ కళాశాలలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో సుల్తానాబాద్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పరిశీలకులు రమణారావు ఆయా కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య, వసతులు, ఇతర అంశాలను చర్చించారు. విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడానికి, డ్రాప్ అవుట్స్‌ను తగ్గించుకోవడానికి నాణ్యమైన విద్య అందించాలన్నారు. జిల్లా అధికారి కల్పన మాట్లాడుతు అడ్మిషన్ల పెంపులో అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ కృషిని అభినందిస్తూ గడువు లోగా మరిన్ని అడ్మిషన్లకు కృషి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ ప్రత్యేకాధికారి రమణారావు

విద్యార్థులు ఆసక్తితో నేర్చుకునేలా బోధించాలి

ధర్మారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులు ఆసక్తితో నేర్చుకునేలా పాఠ్యాంశాలు బోధించాలని ఇంటర్మీడియట్ బోర్డ్ పరిశీలకులు ఉడిత్యాల రమణారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ప్రైవేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల పెరుగుదలకు అధ్యాపకులు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మట్లాడుతూ శ్రద్ధతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ఇంటర్‌బోర్డు డైరెక్టర్ కృష్ణఆదిత్య కృషి చేస్తున్నారన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్, ఆప్‌సెట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకొని ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్స్‌పాల్ డి.అనంతరామకృష్ణ, అధ్యాపకులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

పోలీస్‌స్టేషన్ సందర్శించిన సీపీ

కాల్వశ్రీరాంపూర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు సందర్శించి, రికార్డులను పరిశీలించారు. మండలంలో శాంతి భద్రతల పరిస్థితిని తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్ఐకి సూచించారు. సీపీ వెంట డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు సుబ్బారెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ వెంకటేష్ తదితరులు ఉన్నాయి.

వైద్య బృందాన్ని అభినందించిన కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో లాప్రో స్కోపిక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందిస్తూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణానికి చెందిన 30 సంవత్సరాల ఒక మహిళ కొంత కాలంగా గ్లాడ్ బ్లాడర్ నెక్‌లో స్టోన్‌తో బాధపడు తోంది.

మూడు రోజుల క్రితం డాక్టర్ కె. శ్రీధర్‌ను సంప్రదించగా పరీక్షలు నిర్వహించి అడ్మిట్ చేసుకున్నారు. మంగళవారం జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, మత్తు వైద్యులు కృష్ణవేణి, స్వాతి విజయవంతంగా లాప్రో స్కోపిక్ సర్జరీ నిర్వహించారు. పట్టణానికి చెందిన 35 ఏళ్ళ ఒక మహిళ కడుపు నొప్పితో రాగా స్కానింగ్ చేయగా గర్భసంచి పక్కన ఉన్న అండాశయము మెలిక పడి రక్తస్రావం జరిగింది. వైద్యులు స్రవంతి, గైనకాలజిస్ట్ సౌరయ్య, మత్తు వైద్యులు డా. కె. శ్రీధర్, మెడికల్ సూపరిం టెండెంట్ సర్జరీ నిర్వహించారు. సర్జరీ చేయడం వల్ల ఆ మహిళకు ప్రాణాపాయ ముప్పు తప్పింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సంబరాలు నిర్వహిస్తున్న మహిళలు

పెద్దపల్లిరూరల్ , జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోని మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీవో కొప్పుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఇందిరా మహిళశక్తి సంబరాలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు తీసుకొచ్చిందని, స్వయం ఉపాధి, బ్యాంకు లింకేజి రుణాలు, వడ్డీ లేని రాయితీ రుణాలు, ఆర్‌టీసీ బస్‌ల కోసం పెట్టుబడి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలద్వారా పాఠశాలల మరమ్మతు చేయడంతో పాటు పలు కార్యక్రమాలు మహిళల ద్వారానే చేపడుతుందన్నారు. ఈ అవకాశాలు వినియోగించుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఏపీఎంలు సంపత్, కళ్యాణి, రమాదేవి, సీసీలు, ఎంఎస్ సిబ్బంది. అన్ని గ్రామసంఘాల వీవోఏలు, అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

మొక్కలు కాపాడితే గ్రీన్‌ఫండ్ నిధులు

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మొక్కలను కాపాడితే గ్రామ పంచాయతీకి గ్రీన్‌ఫండ్ నిధులు కేటాయిస్తామని జిల్లా గ్రామీణాబివృద్ధి అధికారి కాళిందిని అన్నారు. మంగళవారం రాఘవపూర్‌లో ఐఆర్‌టీఏ ఎన్జీవో కార్బన్ క్రెడిట్ ప్లాంటేషన్‌పై రాఘవపూర్, సబ్బితం పంచాయతీ కార్యాలయాల్లో టెక్నికల్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. సబ్బితం గ్రామ పంచాయతీ వద్ద డీపీవో పలు సూచనలు చేశారు. 30 ఏళ్ల పాటు వారి యాప్‌లలో నమోదు చేసిన మొక్కలను కాపాడితే నిధులు కేటాయిస్తారన్నారు.

బాబోయ్ దోమలు

- సుల్తానాబాద్‌లో దోమల బెడద
- డ్రైనేజీతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- జ్వరాలతో ఆస్పత్రుల పాలు



సుల్తానాబాద్ పాత బజారులో డ్రైనేజీలో నిలిచిన నీరు



సుల్తానాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు పెరుగుతున్నాయి. ప్రజలు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నా రు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖ దోమల నివారణ చర్యలు తీసుకోవడం లేదు. వానా కాలం ప్రారంభానికి ముందే దోమలు ఎక్కువగా ఉన్నా మున్సిపాలిటీ వారు ఫాగిం గ్ చేయించడం లేదు. మురుగునీటి కాలువల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉంది. రోజుల తరబడి పూడిక తీయడం లేదు. ఫలితంగా దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుధ్య పనులపై అధికారులు పర్యవేక్షించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. సరిపడా సిబ్బంది ఉన్నా దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. వైద్య ఆరోగ్య సిబ్బంది, మున్సి పాలిటీ స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచి దోమల నివారణ చర్యలు చేపట్టా లని, విషజ్వరాల బారిన పడ కుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం




- కొయ్యడ శ్రీనివాస్ గౌడ్

మురుగునీటి కాలువను శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీ నీరు నిలిచిపోయింది. నిలిచిన మురుగు నీరు మూలంగా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. మరో వైపు దోమల బెడద ఎక్కువై జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. మున్సిపాలిటీ వారు మురుగునీటి కాలువలను శుభ్రం చేయించాలి. దోమల బెడద నుంచి విముక్తి కల్పించాలి.

విపరీతంగా దోమల బెడద

- కెక్కర్ల శ్రీనివాస్ పాతబజార్



పట్టణంలో దోమల బెడద విపరీతంగా ఉంది. కొన్ని వాడలలో మురుగునీటి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దోమల నివారణకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టడం లేదు. కనీసం వారం పదిహేను రోజులకోసారి అయినా గతంలో ఫాగింగ్ చేసేవారు. ప్రస్తుతం దానిని మరిచిపోయారు. సక్రమంగా కాలువలను సైతం నిర్వహించడం లేదు. ప్రధాన రోడ్లకు మాత్రమే పారిశుధ్య సేవలు పరిమితమయ్యాయి.

సోలార్ ప్లాంట్ వద్దు...

- రాఘవపూర్‌లో గ్రామస్థుల ఆందోళన

పెద్దపల్లి రూరల్ , జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 1072లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని మంగళవారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. శ్మశానవాటికకు కేటాయించిన భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు నిలిపివేయాలన్నారు. ఈ సందర్భంగా సోలార్ ప్రాజెక్టు నిర్మాణం వద్దకు గ్రామస్థులు చేరుకోని ఆందోళన చేపట్టారు. వందలాది ఎకరాల్లో భూమి ఉండగా శ్మశానవాటిక ఉన్న ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవడం సరికాదన్నారు. అస్థికలు బయటపడటంతోపాటు సమాధులు ధ్వంసం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టు నిర్మాణం నిలిపివేసి ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆందోళన అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందించారు. గ్రామస్థులు మార్కు లక్ష్మణ్, అర్కుటి రామస్వామి, తాడిశెట్టి శ్రీకాంత్, అనంతగిరి కొమురయ్య, కల్లేపల్లి అశోక్, మోదుంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్, సదయ్య, సతీష్, భిక్షపతి, సాగర్, శంకర్, సదయ్య, గుండా శ్రీనివాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



రాఘవపూర్ శ్మశానవాటిక వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వరద గండం



హౌసింగ్‌బోర్డులో వరద నీరు (ఫైల్)

- భయంభయంగా గడుపుతున్న జమ్మికుంట హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు
- 2018, 2021లో నీట మునిగిన ఇళ్లు
- నష్టపరిహారం అందజేసి చేతులు దులుపుకున్న వైనం
- శాశ్వత చర్యలు కరువు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఐదు వందల కుటుంబాలు నివసిస్తున్న జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీ వర్షాకాలం వచ్చిందంటే వరద భయంతో బిక్కుబిక్కుమంటోంది. భారీ వర్షం కురిసిందంటే కాలనీలోని ఇళ్లన్నీ నీట మునుగాల్సిందే. వరద నీరు ఇళ్లలోకి చొచ్చుకువచ్చి నిత్యవసర వస్తువులు నీళ్ల పాలై, కట్టుబట్టలతో కాలనీ వాసులు రోడ్డు ఎక్కిన సంఘటనలు ఉన్నాయి. గడిచిన ఆరేళ్ల కాలంలో రెండుసార్లు కాలనీ నీటిమునిగింది. ఆ సమయంలో పాలకులు, అధికారులు హడావుడి చేసి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికి శాశ్వత పరిష్కారం చూపలేక పోయారు. మళ్లీ వర్షాకాలం రావడంతో కాలనీవాసులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు.



వరద ఉధృతి (ఫైల్)

లోతట్టు ప్రాంతం..

జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనిలో ఐదు వందల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. లోతట్టు ప్రాంతం కావడంతో 2018లో కురిసిన భారీ వర్షానికి సుమారు మూడు వందల ఇళ్లు నీట మునిగాయి. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నగదు నీళ్లపాలయ్యాయి. కట్టుబట్టలతో బంధువుల ఇళ్లకు వెళ్లి తల దాచుకున్నారు. మూడు రోజుల పాటు పాలకులు, అధికారులు పని చేస్తే వరద నీరు బయటకు వెళ్లింది. ఆ సమ యంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి నష్టపరిహారం అందలేదు.

వరద కాలువ నిర్మించినా..

మున్సిపల్ పాలకవర్గం 2018లో 35 లక్షల నిధులతో వరద కాలువ నిర్మాణ పనులు చేపట్టింది. 2020లో పనులు పూర్తయ్యాయి. దానితో ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. 2021లో కురిసిన భారీ వర్షానికి హౌసింగ్‌బోర్డు కాలనీలోని మూడు వందలకు పైగా ఇళ్లు నీట మునిగాయి. వరద కాలువ నుంచి ఉప్పొంగిన నీళ్లు కాలనీని చుట్టుముట్టాయి. ఆ సమయంలో హుజూరాబాద్ ఉప ఎన్నిక సమీపించడంతో, అధికార యంత్రాంగం మొత్తం కదిలి వచ్చింది. దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టింది. కాలనీలోని పార్కు దగ్గర నుంచి ఏడు ఫీట్ల వెడల్పుతో ఎక్స్‌కావేటర్ల సహాయంతో మట్టి కాల్వ తీయడంతో వరద నీరు వెళ్లిపోయింది. 2021లో హౌసింగ్ బోర్డు కాలని దుస్థితిని చూసిన అప్పటి కలెక్టర్ వరద కాలువను విస్తరించాలని, ఇందుకు ఎస్టిమేట్ రూపొందించి ప్రభుత్వానికి పంపించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. 53 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపించినా నిధులు మంజూరు కాలేదు. వర్షాకాలం వచ్చింది. ఈసారి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో హౌసంగ్‌బోర్డు కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. తమ కాలనీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.



నీట మునిగిన ఇల్లు (ఫైల్)

శాశ్వత పరిష్కారం చూపించాలి

శ్రీపతి నరేష్, మాజీ కౌన్సిలర్



వరద కాల్వ నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలి. మళ్లీ వర్షాకాలం వచ్చింది. భారీ వర్షం పడితే కాలనీవాసులు కంటి మీద కునుకు లేకుండా జాగా రం చేయాల్సిన దుస్థితి. 2018, 2021లో ఇళ్లు నీట మునిగాయి. రాష్ట ప్రభుత్వం స్పందించి వరద కాలు వ నిర్మాణం చేపట్టి శాశ్వత పరిష్కారం చూపించాలి.

వరదలతో తీవ్రంగా నష్టపోయాం

బెజ్జంకి నరహరి, హౌసింగ్‌బోర్డు కాలనీవాసి



హౌసింగ్‌బోర్డు కాలనీలో 22 సంవత్సరాలుగా నివసిస్తున్నా. 2018లో మొదటి సారి ఇళ్లు మొత్తం నీట మునిగాయి. ఆ సమయంలో ఒక వైపు వరద కాల్వ నిర్మించి వదిలేశారు. 2021లో మళ్లీ భారీ వర్షాలు వచ్చాయి. ఆ సమయంలో కాలనిలోని వందలాది ఇళ్లు నీట మునిగాయి. నిత్యవసర వస్తువులు, నగదు, ఇతర వస్తువులు మొత్తం నీటిపాలయ్యాయి. వరద తగ్గేవరకు బంధువుల ఇళ్లలో తలదాచుకున్నాం. వరద సమయంలో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం స్పందించి వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

15 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జమ్మికుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల శాంతినగర్‌లో 15కిలోల గంజాయిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు మంగళవారం పట్టుకున్నారు. కరీంనగర్‌కు చెందిన అఫ్రిద్, శశిప్రీతం, తరుణ్, జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఒక ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దులో తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా ఎక్కువ ధరకు అమ్మవచ్చని అభిప్రాయానికి వచ్చారు. నలుగురు కలిసి రెండు ద్విచక్ర వాహనాలపై ఇటీవల ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా సరిహద్దుకు వెళ్లారు. అక్కడ 15కిలోల గంజాయి కొనుగోలు చేసి మంగళవారం ఇక్కడకు వచ్చారు. జమ్మికుంటకు చెందిన ప్రేమ్‌చంద్‌కుమార్ ఇంట్లో నిల్వచేసి తర్వాత అమ్మకాలు జరుపుదామని నిర్ణయానికి వచ్చారు. పక్కా సమాచారం అందుకున్న కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీస్‌లు వారిని వలపన్ని పట్టుకున్నారు. వారివద్ద ఉన్న 15కిలోల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోని జమ్మికుంట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంజాయి ముఠా వివరాల కోసం సీఐ ఎస్ రామకృష్ణగౌడ్‌ను సంప్రదించగా బుధవారం వెల్లడిస్తామని తెలిపారు.

40మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 40మంది మందుబాబులకు మంగళవారం సిరిసిల్ల 2వ శ్రేణి మెజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు ఇచ్చారని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 27మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయలు, మరో ముగ్గురికి 1500 రూపాయలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ పట్టుబడిన 13మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధించారన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పట్టుబడిన మందుబాబులకు సిరిసిల్ల ట్రాఫిక్ ఆర్ఎస్ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చి, మద్యం సేవించి వాహనాలు నడపబోమని ప్రతిజ్ఞ చేయించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన యవతకు భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ట్రాఫిక్, రోడ్ భద్రత నియమాలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

10 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందితో పాటు ఇటీవల ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఇద్దరిని తహసీల్దార్ ఎదుట మంగళవారం హాజరుపరచి బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చేగుర్తి శివారులోని వాగు నుంచి ఇసుకను దొంగతనంగా ట్రాక్టర్ ద్వారా రవాణా చేస్తూ పట్టుబడిన దుర్శేడ్ గ్రామానికి చెందిన కాశిపాక అర్జున్, నల్లగుంటపల్లికి చెందిన విలాసాగరం శేఖర్‌లతో పాటు ఇటీవల పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపరచినట్లు తెలిపారు. మరోసారి తప్పు చేసిన సందర్భంలో లక్ష రూపాయల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధించేలాగా బైండోవర్ చేసి, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి

కాల్వశ్రీరాంపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారుపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి గొర్రెలు మృతి చెందాయి. గొర్లకాపరి గిరవేన అజయ్ మంగళవారం గ్రామశివారు నక్కల ఒర్రె సమీపంలో గొర్రెలను మేపుతుండగా కరెంటు వైర్లు తెగిపడి మూడు గొర్రెలు మృతి చెందాయి. మాజీసర్పంచ్ గాజనవేన సదయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే విద్యుత్ అధికారులకు తెలుపగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. చనిపోయిన గొర్రెల విలువ సుమారు 40 వేల రూపాయలు ఉంటుందని బాధితుడు అజయ్ తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన వేడుకుంటున్నాడు.

మొబైల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లికి చెందిన బి సాయికిరణ్ మార్చి 21న తన సెల్‌ఫోన్‌ను గ్రామంలో పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం సెల్‌ఫోన్‌ను యజమాని సాయికిరణ్‌కు కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి పోలీసుఠాణాలో అందజేశారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కరీంనగర్ రూరల్ ఠాణా కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

వీర్నపల్లి: నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వెతికి పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన గుంటుకు రాజు పదిరోజుల క్రితం సెల్‌ఫోన్ పొగొట్టుకోగా పోలీసులకు పిర్యాదు చేశాడు. దీంతో సీఈఐఆర్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్ కనుక్కోని పిర్యాదుదారుడికి అందించారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్

ధర్మపురి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై పది రోజుల క్రితం అత్యాచారం చేసిన కేసులో గాదెపల్లి గ్రామానికి చెందిన నిందితుడు వెలుగు గంగాధర్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా నిందితుడు గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉరి వేసుకుని పూజిత(20) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారానికి చెందిన చందు అనే యువకుడికి జగిత్యాల జిల్లా బీమారం మండలం రాగోజీపేట గ్రామానికి చెందిన పూజితతో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి కోసం వీరు జగిత్యాలలోని కృష్ణానగర్ ప్రాంతానికి వలస వచ్చారు. పూజిత తండ్రి మల్లేశ్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, పెద్దనాన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అప్పటి నుంచి పూజిత మానసిక వేదనకు గురైంది. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి రజిత ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు..



శ్రీనివాస్(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీర్లవంచ గ్రామానికి చెందిన గంగు శ్రీనివాస్(22) అనే యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుంటుంబసభ్యుల కథనం.. గంగు బక్కయ్య-వజ్జమ్మ దంపతుల కుమారుడు శ్రీనివాస్ కొద్దిరోజులుగా వ్యసనాలకు, మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాస్ గ్రామ శివారులోని గ్రామ పంచాయతీ డంపుయార్డ్ షెడ్డులో మంగళవారం ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడి తండ్రి బక్కయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రివానిపల్లెకు చెందిన కాటిపల్లి అమృతమ్మ (70) అనే వృద్ధురాలు బావిలో పడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతమ్మ కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం వెతుకగా మంగళవారం అదే గ్రామంలోని ఓ బావిలో మృతి చెంది కనపడింది. మృతురాలి కుమారుడు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

భూ వివాదం కేసులో ఒకరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భూవివాదం కేసులో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగే మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకట నలో తెలిపారు. గ్రామంలోని అన్నదమ్ములు మునిగే దేవయ్య, మునిగే మల్లయ్య మధ్య కొంతకాలంగా భూవివాదం కొనసాగుతోందని పేర్కొన్నారు. గత నెల 25న ఇరు కుటుంబాల మధ్య గొడవ తారా స్థాయికి చేరుకోవడంతో ఆగ్రహించిన మల్లయ్య కర్రతో దేవయ్యపై దాడి చేసి గాయపర్చాడని చెప్పారు. బాధితుడు దేవయ్య భార్య అరుణ ఫిర్యాదు మేరకు మునిగే మల్లయ్య, అతని భార్య మనెవ్వలపై కేసు నమోదు చేశామని చెప్పారు. దర్యాప్తు అనంతరం మల్లయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇద్దరు విలేకరులపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నావంటూ ఓ వ్యక్తిని డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు తహసీల్దార్ పేరిట డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు దిగిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విలేకరులు శ్రీరామోజు ప్రవీణ్, ఒగ్గు బాలరాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రాజన్నపేటకు చెందిన వ్యక్తి ఊడుగుల సురేందర్ ఈనెల 6న తన రెండు టిప్పర్లతో మట్టిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద పోస్తున్న క్రమంలో ప్రవీణ్, బాలరాజు అక్కడకు చేరుకుని అనుమతి లేదం టూ బెదిరించి పేపర్లలో రాకుండా ఉండేందుకు రూ.10 వేలు తీసుకున్నారని పేర్కొన్నారు. మరుసటి రోజు మట్టిని రవాణా చేసుకునేందుకు తహసీల్దార్ రూ.30 వేలు అ డుగుతున్నారని చెప్పడంతో పాటు ఇబ్బందులకు గురి చేసి అసత్యప్రచారం చేశారని చెప్పారు. సదరు వ్యక్తి వద్ద డబ్బులు తీసుకోవడంతో పాటు తన పేరు చెప్పి రూ.30 వేలు డిమాండ్ చేసిన విలేకరులు ప్రవీణ్, బాలరాజుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సుజాత ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

9న ఇసుక వేలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకోగా ఆ ఇసుకను ఈ నెల 9న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు కొత్తపల్లి తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 80 టన్నుల వరకు ఇసుక వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము 600 రూపాయలు చెల్లించి పద్మనగర్‌లోని కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆరవణలో నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలని సూచించారు. అలాగే తనీఖీల్లో పట్టుబడిన 10 ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ కార్యాల య ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. దీని వేలంలో పాల్గొనేవారు 1,650 రూపాయలు ధరావత్తు సొమ్ము చెల్లించాలని సూచించారు.

తల్లిదండ్రులను పోషిస్తేనే ఆస్తులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వర్లు

- ఆర్డీవో వెంకటేశ్వర్లు

సిరిసిల్ల టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను అన్ని విధాలుగా పోషిస్తేనే వారసత్వంగా వచ్చే ఆస్తులు కొడుకులకు చెందుతా యని ఆర్డీవో వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో తెలంగాణ సీనియర్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులను విస్మరించిన కొడుకులు, కూతుళ్లతో పాటు కోడళ్లకు ఆర్డీవో వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ నిర్వహించి నాలుగు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించడంలో కొడుకులు, కూతుళ్లు నిర్లక్ష్యం చేస్తే సంపాదించిన ఆస్తులను తిరిగి తల్లిదండ్రుల పేరిట నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, కోశాధికారి దొంత దేవదాసు, సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, అధికారులు బాధిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బూరుగు చెరువులోకి నీటి విడుదల

- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

కోనరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బూరుగు చెరువులోకి నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. కోనరావుపేట మండలం కనగర్తి బూరుగు చెరువులోకి అధికారులు స్పందించి పైప్ లైన్లు ఏర్పాటు చేసి నీరు వచ్చేలా చేశారు. ఈ మధ్యనే మల్కపేట రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా నీటిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విడుదల చేశారు. నీటిని మారుపాక, సుద్దాల గ్రామాలకు వెళ్లడానికి కనగర్తి గ్రామం వద్ద అడ్డుకట్ట వేశారు. దీంతో కనగర్తి గ్రామంలోని బూరుగు చెరువుకు నీరు అందలేదు. వానాకాలం సీజన్‌లో ఇబ్బందులు తలెత్తుతాయని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అడ్డుకట్టను తొలగించి పైప్‌లైన్ ఏర్పాటు చేసి బూరుగు చెరువులోకి నీరు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కనగర్తి బూరుగు చెరువులోకి చేరుతున్న నీరు

ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి మృతి

జగిత్యాల క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫెయిల్ అయ్యాడనే మనస్తాపంతో జగిత్యాలలో ఆత్మహత్యాయత్నం చేసిన ఇంటర్ విద్యార్థి నల్ల లోహన్(17) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లికి చెందిన నల్ల లోహన్ పట్టణంలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో లోహన్ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు, గమనించిన కుటుంబసభ్యులు ఆసు పత్రికి తరలించగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుప త్రిలో చికిత్స పొందుతూ లోహన్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. విద్యార్థి తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల టౌన్ పోలీసులు పేర్కొన్నారు.

జీవో నంబర్ 282ను రద్దు చేయాలి

- సిరిసిల్లలో జీవో కాపీల దహనం

సిరిసిల్ల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పనిగంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 282ను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన జీవో 282ను రద్దుచేయాలంటూ జీవో కాపీలను నాయకులు దహనం చేసి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పోరేట్ శక్తుల లాభాల కోసం కార్మిక వర్గాన్ని శ్రమదోపిడీలకు గురి చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 10గంటలుగా మార్పుతూ జారీచేసిన జీవోను సీఐటీయూ వ్యతిరేకిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఆచరణలో మాత్రం బీజేపీ ప్రభుత్వానికి అనుకూల విధానాలకు అవలంబిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతోందని కార్మికులకు సంబంధించి షెడ్యూల్డ్ పరిశ్రమల కార్మికులకు కనీస వేతనాల జీవోలను సవరించకుండా పనిగంటలు పెంచుతూ జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ జీవోకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని బుధవారం కార్మిక చట్టాల హక్కుల పరిరక్షణ కోసం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గన్నేరం నర్సయ్య, సీఐటయూ నాయకులు జిందం కమలాకర్, బాలయ్య, రాజయ్య, దేవరాజు, లక్ష్మీ, మమత, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన కేశెట్టి శ్రీధర్ అనే యువకుడు అదృశ్యమైనట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ ఒక ప్రటనలో తెలిపారు. సోమవారం ఇంటి నుంచి శ్రీధర్ వెళ్లిపోయి ఇప్పటి వరకు ఇంటికి చేరుకోకపోవడంతో సోదరుడు శ్రీకాంత్ ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

సైదాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు పూదరి అజయ్ గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా మోకు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయినట్లు స్థానికులు తెలిపారు. చికిత్సకోసం అజయ్‌ని హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక





ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ఎంపికైన విద్యార్థితో కోచ్

ధర్మారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు దొంగతుర్తి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆర్ అనూష, వి వైష్ణవి ఈ నెల 5వ తేదీన గోదావరిఖని సింగరేణి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరుపున ఆడనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగో పాల్‌రెడ్డి, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ ఇండియా మిషన్ పాఠశాలకు చెందిన ప్రియాంక కుమారి రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ కృష్ణమూర్తిగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గోదావరిఖని జవహర్ స్టేడియంలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించారు. బుధవారం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎన్నికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్ మహేంద్ర, వైస్‌ప్రిన్సిపాల్ ప్రేమానందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అల్ట్రాటెక్ కంపెనీ యాజమాన్యం అభినందించారు.

డిగ్రీ సెకండ్ సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ డి. సురేష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి

గణేశ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఈ విద్యాసంవత్సరానికి చెందిన అండర్ గ్రాడ్యుయేట్(యూజి) ద్వితీయ సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డి. సురేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. విభాగాల వారీగా ఉత్తీర్ణత శాతం: బీఏ:65.71శాతం, బీకాం:71.05, బీఎస్సీ (భౌతికశాస్త్రం)81.71, బీఎస్సీ (జీవశాస్త్ర విభాగం): 57.87 శాతం, మొత్తం ఉత్తీర్ణత 69.22 శాతం ఉన్నట్లు వారు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల పరీక్షల నియంత్రణాధికారి డా. జి. శ్రీనివాస్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డా. రజనీదేవి, డా. కె. సతీష్ కుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్లు డా. ఎన్. మనోజ్ కుమార్, డా.విద్య, ఎన్ఎస్ఎస్, కోఆర్డినేటర్ డా. మొగిలి పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలి



ప్రమాణ స్వీకారం చేస్తున్న టీఎన్జీవో కార్యవర్గ సభ్యులు

జ్యోతినగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్ డిమాండ్ చేశారు. రామగుండం మండల టీఎన్జీవో కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఎన్టీపీసీలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కమిటీ నాయకత్వం, ఉద్యోగులు కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీఎన్జీవోల డిమాండ్ల సాధనకు సంబంధించి ఉద్యమానికి ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, మండల టీఎన్జీవో అధ్యక్షుడు డి.జగన్, కార్యదర్శి పి.కృష్ణ, కోశాధికారి డి.రవితేజ, జిల్లా నాయకులు సందీప్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కొమరయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు



వారంలో రెండు నుంచి మూడు సార్లు

వ్యాధి తీవ్రతను బట్టి డయాలసిస్ రోగులకు రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుంది. దీంతో కొన్ని ఆసుపత్రుల్లో షిఫ్టుల సంఖ్య పెంచినప్పటికీ సమయం సరిపోకపోవడంతో ఆసుపత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు డయాలసిస్ చేయాల్సి వస్తుందని, ఒక్క రోగికి 4 నుంచి 5గంటల పాటు రక్తం శుద్ధి చేయాల్సి వస్తుందని ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారు.


ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు సరిపోక ఇబ్బందులు

సరైన సమయానికి వైద్యం అందక మృత్యువాత

కళ్యాణ్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఆహారపు అలవాట్లు, పెరిగిన కాలుష్యంతో పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అవసరం ఉంటుంది. అయితే ప్రభుత్వాసుపత్రిలో సరైన వసతులు లేక రోగుల పరిస్థితి దినదిన గండంగా మారింది. డయాలసిస్ స్థాయికి చేరుకునే రోగులకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ప్రభుత్వం ఆరు సంవత్సరాల క్రితం డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేయగా రోగుల సంఖ్య పెరగడంతో సరైన సమయంలో డయాలసిస్ లభించక ఇబ్బందులు పడుతున్నారు.

ఒకప్పుడు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే డయాలసిస్ సెంటర్లు ఉండేవి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పలు ప్రభుత్వాసుపత్రుల్లో 5 పడకలతో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆరు సంవత్సరాల క్రితం అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 5 పడకల డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఇందులో రోజూ నాలుగు షిఫ్టుల్లో 45మంది చికిత్స పొందుతున్నారు. అనంతరం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో కూడా డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో రోజుకు 30మంది, మంథని ప్రభుత్వాసుపత్రిలో 10 మందికి డయాలసిస్ చేస్తున్నారు. ఇదే కాకుండా గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిలో రోజుకు 35మందికి డయాలసిస్‌ను చేయిస్తున్నారు. వ్యాధిబారిన పడిన వారి సంఖ్య పెరగడంతో పడకలు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాధిని గుర్తించేలోపే మరణాలు



మధుమేహం వ్యాధి స్టేజ్-3కి చేరుకునే బాధితుల సంఖ్య ఎక్కువైంది. మధుమేహం స్టేజ్-1, 2ల్లో ఉన్న వారు సమయానికి మందులు వాడడం, ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం వల్ల వ్యాధి తీవ్రత కొంత తగ్గుతున్నప్పటికీ చివరి దశలో వ్యాధిని గుర్తించే సరికి చాలా మంది డయాలసిస్ వరకు వెళ్లాల్సి వస్తుంది. రెండు నెలల క్రితం గోదా వరిఖని రాంనగర్‌కు చెందిన చొప్పరి సదానందం అనే యువకునికి కాళ్లు వాపు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు తెలిపారు. కొద్ది రోజులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. వారానికి రెండు రోజులు డయాలసిస్ చేయాల్సి రావడంతో సదానందం గోదావరిఖనిలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చికిత్స చేయించుకోవడానికి రాగా పడకలు ఖాళీ లేకపోవడంతో మంథని జనరల్ ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ కూడా బెడ్లు లేకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడి నుంచి పెద్దపల్లి వెళ్లాడు.

అక్కడ కూడా డయాలసిస్ చేయడం కురదని వైద్యులు చెప్పడంతో ఇంటికి వచ్చిన సదానందం రెండు రోజులకే మృతి చెందాడు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి చెందిన నారాయణ అనే వృద్ధుడు మంచి ర్యాలలో డయాలసిస్ కేంద్రానికి రాగా అక్కడ ఖాళీ లేకపోవడంతో గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి వచ్చాడు. అక్కడ కూడా బెడ్లు దొరకకపోవడంతో పెద్దపల్లికి వెళ్లాలని సూచించడంతో చివరికి కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకున్నాడు.



పెరిగిన కిడ్నీ బాధితులు

రాజశేఖర్‌రెడ్డి, సూపరింటెండెంట్, మంథని

వాతావరణ కాలుష్యం, మితి మీరిన ఆహారం, నీటి కాలు ష్యంతో కిడ్ని బాధితుల సంఖ్య పెరుగుతుంది. వందలో సుమా రు 40మంది బార్డర్ లైన్‌లో మధుమేహ వ్యాధికి గురవుతున్నారు. కొందరు షుగర్, బీపీ ఉన్న వారికి కిడ్నిలపై ప్రభావం చూపడంతోపాటు మితిమీరిన ఆహారం తీసుకోవడం, సరైన నిద్రలేకపోవడం, నిత్యం మానసిక ఒత్తిడికి గురి కావడంతో కిడ్ని వ్యాధుల బారిన పడుతున్నారు. ఆహార అలవాట్లను నియంత్రించుకోవాలి. రోజూ వ్యాయామం చేయాలి. యోగా, నడకపై దృష్టి పెట్టాలి.



డయాలసిస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులు

ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను

మంజూరు చేయాలి

డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ

గంభీరావుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు సంబంధించి ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను ప్రభుత్వం విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండల కేంద్రంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్‌లోన్లు, టీజీఐఎల్‌సీలోన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లతో పాటు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమోషన్లలో మొదట గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను బదిలీ చేసి, తరువాత ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. పీఎస్ హెచ్ఎం ప్రమోషన్లలో బీఈడీ, డీఈడీలలో కామన్ సీనియార్టీ ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు శీల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దోసల మధు, డీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు కుమ్మరవేణి శ్రీనివాస్, ఎం దేవేంద్రం, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, చీకట్ల రాజు, సభ్యులు శ్రీశైలం ఉన్నారు.

మాల కులస్థులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఇల్లందకుంట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం ఇల్లంద కుంట పోలీస్‌స్టేషన్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నమదాసు తల భాగంలో కౌశిక్‌రెడ్డి తల ఫొటో పెట్టి మాల కన్నమదాసును, మాలలను అవమానపరుస్తూ, మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శీత్లా భవాని వేడుకలు



పెగడపల్లిలో నిర్వహించిన వేడుకల్లో గిరిజన మహిళలు

పెగడపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లి తండాలో మంగళవారం శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

- **వీర్నపల్లి** : మండలంలోని తండాల్లో శీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గద్దెల వద్ద గిరిజనులు సాంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేశారు. బంజార సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్ నాయక్ పాల్గొన్నారు. బాబాయిచెర్వు తండాలో జరిగిన వేడుకల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరితో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గిరిజనులు నృత్యాలతో వారికి స్వాగతం పలికారు.



వీర్నపల్లి పూజలు నిర్వహిస్తున్న గిరిజన నాయకులు

ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త సంవత్సరంలోగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి
- 847 మంది నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాల పంపిణీ
- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు రిజర్వాయర్ ముంపు గ్రామల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం శ్రీకన్వెన్షన్‌లో మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులు ఇళ్లు కట్టుకోకుండా ఖాళీ ప్లాట్స్ ఉన్న వారికి స్పెషల్ కోటా కింద 847 మంది నిర్వసితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటితో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇళ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోటా కింద మిడ్ మానేరు నిర్వసితలుకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామన్నారు.

మరో 3 వేల ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పెండింగ్‌లో విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పని సరిగా మంజూరు చేస్తామన్నారు. అర్బన్ మండలంలో ముంపు గ్రామాల నిర్వాసితులకు తప్పనిసరిగా ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. దశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు ఇవ్వడం లేదని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోనే సాధ్యమైందని వివరించారు. రూ.76కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందన్నారు. ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ధ్వజమెత్తారు.

ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయాంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే ఎన్నికల సమయంలో ఇచ్చిన మేరకు ఒక్కో హామీ అమలు చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృషితో స్టేట్ రిజర్వు బ్యాంకు నుంచి మొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇళ్లను ఇప్పించారన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాలలోపు మాత్రమే నిర్మించాలన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలకు ఇళ్లు వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య తదితరులు ఉన్నారు.

ఘాట్‌రోడ్డు అపరిశుభ్రత



మల్యాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్రత దర్శనం ఇస్తోంది. ప్లాసిక్ కవర్లు, తాగి పడేసిన వాటర్ బాటిళ్ల తదితర వ్యర్థాలతో ఘాట్‌రోడ్డుపై నడిచి వెళ్లే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం కొండపైన పదుల సంఖ్యలో షిఫ్ట్ పద్ధతిలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఘాట్‌రోడ్డు దిగువ నుంచి జైజంక్షన్ వరకు అపరిశుభ్రత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



కొండగట్టు ఘాట్‌రోడ్డు పక్కన ప్లాస్టిక్ వ్యర్థాలు

ముగిసిన పోలీస్ డ్యూటీ మీట్

విజేతలకు పతకాలు అందజేత



విజేతలతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్ కేంద్రంగా కరీంనగర్‌లో జరుగుతున్న రాజన్న జోన్-3 స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ డ్యూటీ మీట్‌లో ప్రధానంగా ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అవి సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, యాంటీ సబాటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, పోలీస్ ఫొటోగ్రఫీ, పోలీస్ వీడియోగ్రఫీ. వీటిల్లో విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసి వరంగల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్ పోటీలకు పంపించనున్నారు. ఈ పోటీల్లో మెదక్, సిద్ధిపేట, కామారెడ్డి జిల్లాల పోలీసులు పలు విభాగాల్లో పతకాలు సాధించారు.

విభాగాల వారీగా డ్యూటీ మీట్ పోటీల్లో విజేతలు:

- సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ విభాగంలో ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్షలో కరీంనగర్ కమిషనరేట్ గంగాధర పోలీసుఠాణాలో పని చేస్తున్న ఎస్ఐ వంశీకృష్ణ బంగారు పతకం సాధించారు. శంకరపట్నం పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రెడ్డి కాంస్య పతకం సాధించారు.
- క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినల్ చట్టాల విభాగంలో కమిషనరేట్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి నరేందర్‌రెడ్డి వెండి పతకం సాధించారు.
- మెడికల్ లీగల్ టెస్ట్ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్ చొప్పదండి సీఐ ఏ ప్రదీప్‌కుమార్ బంగారు పతకం సాధించగా, గంగాధర పోలీసు ఠాణా ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణ కాంస్య పతకం సాధించారు.
- లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎగ్జిబిట్స్ పరీక్షలో కమిషనరేట్ చెందిన ఎస్ఐ యూనస్‌కు వెండి పతకం సాధించారు.
- ఫింగర్ ప్రింట్ సైన్స్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ యూనస్ గోల్డ్ మెడల్, కమిషనరేట్‌కు చెందిన ఎస్ఐ బి వంశీకృష్ణ బ్రాంజ్ మెడల్ సాధించారు.
- క్రైమ్ సీన్ ఫొటోగ్రఫీ పరీక్షలో కమిషనరేట్ ఎస్సై ఎస్ఐ యూనస్ వెండి పతకం, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎస్ఐ సీహెచ్ గణేష్ కాంస్య పతకాలను సాధించారు.
- పోలీస్ పోర్ట్రెట్ పరీక్షల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రసన్న కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.
- యాంటీ సాబెటేజ్ చెక్‌లో గ్రౌండ్ సర్చ్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన వి సంతోష్, వి వెంకటేష్ కానిస్టేబుల్ గోల్డ్ మెడల్ సాధించారు.
- రూమ్ సర్చ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎం శ్రవణ్ కుమార్, జి కిరణ్ కుమార్‌లు బంగారు పతకం సాధించగా, కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన కానిస్టేబుళ్లు ఇ చంద్రమోహన్, బి కిరణ్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.
- వెహికల్ సెర్చ్‌లో కమిషనరేట్‌కు చెందిన ఎస్.ఎస్ శ్రీనివాస్, వీరాజులకు బ్రాంజ్ మెడల్స్ దక్కాయి.
- యాక్సెస్ కంట్రోల్‌లో కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ టి రమేష్, ఏ మహేష్‌లకు సిల్వర్ మెడల్ సాధించారు.
- డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన డాగ్ హ్యాండ్లర్, పోలీస్ కానిస్టేబుల్ జి శ్రీనివాస్ సిల్వర్ మెడల్ సాధించాడు.
- నార్కోటిక్‌లో కరీంనగర్ కమిషనరేట్ చెందిన ఏ శంకర్ సిల్వర్ మెడల్ సాధించారు.
- కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్‌లో కంప్యూటర్ అవేర్నెస్, ఆబ్జెక్టివ్ టెస్ట్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ఏం సతీష్ కుమార్ సిల్వర్ మెడల్ బ్రాంజ్ మెడల్ సాధించారు.
- ఆఫీస్ ఆటోమేషన్‌లో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన జి అనిల్ కుమార్ సిల్వర్ మెడల్ సాధించారు.
- ప్రోగ్రామింగ్ ఎబిలిటీలో కరీంనగర్ కమిషనర్‌కు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్ కానిస్టేబుల్ జి సంతోష్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.
- పోలీస్ ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ మల్లేశం బ్రాంజ్ మెడల్ సాధించారు.
- క్రైమ్ సీన్ అబ్జర్వేషన్ విభాగం రాత, ప్రాక్టికల్ పరీక్ష పోటీలలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో మహిళా పోలీసుఠాణాలో పనిచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ పి కిషోర్‌గౌడ్ గోల్డ్ మెడల్ సాధించగా, కమిషనరేట్‌లోని రూరల్ పోలీసు ఠాణాలో పని చేస్తున్న పోలీస్ కానిస్టేబుల్ ఎస్ రాజ్‌కుమార్‌కు సిల్వర్ మెడల్ సాధించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, అడిషనల్ డీసీపీ (ఏఆర్) భీం రావు, ఏసీపీలు విజయ్ కుమార్, వేణుగోపాల్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిహారం అందలేదని రోడ్డుపై బైఠాయించిన రైతులు

శంకరపట్నం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం శివారులో జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం రాలేదని మంగళవారం బైపాస్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మ్యాకల కొంరయ్య, సముద్రాల చంద్రయ్య మాట్లాడుతూ కేశవపట్నం శివారులో సర్వే నంబర్ 73లో ఒక్కొక్కరికి 14 గుంటల చొప్పున మొత్తం 28 గుంటల భూమి ఎన్‌హెచ్-563 బైపాస్ రోడ్డు నిర్మాణంలో పోయిందన్నారు. రెండేళ్లు గడుస్తున్నా తమకు పరిహారం అందలేదని ఆవేదన చెందారు. ఇప్పటికే ఆ స్థలంలో రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. సంబంధిత శాఖాధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదన్నారు. బైపాస్ రోడ్డుపై బైఠాయించి జాతీయ రహదారి నిర్మాణ సంస్థ వాహనాలను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సురేఖ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



కేశవపట్నంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

నేడే సార్వత్రిక సమ్మె

(5వ పేజీ తరువాయి)

విధంగా కార్మిక సంఘాలు సంసిద్ధం చేశాయి. అయితే అండర్ గ్రౌండ్ బొగ్గు గనుల్లో అత్యవసర సర్వీసుల్లో పని చేసే సిబ్బంది, కార్మికులు అనివార్యంగా విధులకు హాజరు కావాల్సి ఉంటుంది. మొత్తంగా సింగరేణిలో ఈ సార్వత్రిక సమ్మె జరిగేలా వాతావరణం ఏర్పడింది. రామగుండం ఎన్టీపీసీలో కార్మిక సంఘాలు సమ్మెను విజయవంతం చేసేందుకు ముమ్మరంగా ప్రచారం నిర్వహించాయి. కానీ ఎన్టీపీసీలో సమ్మెకు సంబంధించి స్పష్టమైన వైఖరి కార్మికవర్గంలో కనిపించలేదు. బుధవారం తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలతో పాటు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) సైతం తమ మద్దతును ప్రకటించాయి. సమ్మె సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మత్తు పదార్థాలు వాడవద్దు

పాలకుర్తి, జూలై 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలని ఎస్ఐ స్వామి అన్నారు. మంగళవారం కన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించడంతోపాటు రామరావుపల్లెలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులను అభినందించారు.

రెవెన్యూలో అధికారుల బదిలీలు

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ఐ -1గా విధులు నిర్వహించిన భానుకుమార్‌ను రామగుండం ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌గా, ఆర్ఐ-2వెంకటరాజ్‌ను రామగుండం సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. మీసేవ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ కృష్ణను మంథనికి, ధరణి ఆపరేటర్‌గా ఉన్న సందీప్‌ను రామగుండం మండలానికి బదిలీ చేశారు.

బయోమెట్రిక్ అమలు

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో పారదర్శకత పాటించేందుకు ప్రభుత్వం ఉద్యోగులకు బయోమెట్రిక్ అటెండెన్స్‌ను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో స్థాయి నుంచి అటెండర్ వరకు బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. రోజు అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్‌తో హాజరును నమోదు చేసుకుంటున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

పెద్దపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో బీజేపీ తిరుగులేనిశక్తిగా అవతరించబోతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామచంద్రారావును మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి, అసెంబ్లీ ఎన్నికల నాటికి విజయానికి మార్గం సుగమం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కార్మిక చట్టాల రక్షణకు సమ్మెలో పాల్గొనండి

గోదావరిఖని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భవన నిర్మాణ కార్మిక వర్గానికి అన్యాయం తలపెడుతున్నదని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటం రాజు ఆరోపించారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు తుంగపిండి మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బుధవారం జరుగనున్న సమ్మెపై కరపత్రాలు విడుదల చేశారు. కోటం రాజు మాట్లాడుతూ సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. వేల్పుల కుమారస్వామి, పరమేష్, మోహన్, కిషన్, కనకయ్య, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఓదెల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం వర్షాల వల్ల జరగబోయే ప్రమాదాల నివారణపై సమావేశాన్ని నిర్వహించారు. ముంపు ప్రాంతాలను, కూలిపోయే దశలో ఉన్న గృహాలను గుర్తించాలని తహసీల్దార్ ధీరజ్ కుమార్ తెలిపారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడే విధంగా ఉన్న కాజ్ వేలు, రోడ్ డ్యాంలను గుర్తించాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న చెరువులను తనిఖీ చేయాలన్నారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీఓ షబ్బీర్ పాష, ఎంఈఓ రమేష్, ఏఈఓ పాల్గొన్నారు.

సహకార సంఘాలకు సంపూర్ణ సహకారం



విినియోగదారులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సహకార అధికారి శ్రీమాల

సుల్తానాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారం అందజేస్తామని జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం - 2025ను పురస్కరించుకుని దేవునిపల్లిలో చిన్నకలువల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో వినియోగదారుల కోసం డ్రా తీసి పలువురికి బహుమతులు అందజేశారు. డీసీఓ మాట్లాడుతు జిల్లాలోని పలు సహకార సంఘాలు వ్యవసాయ అనుబంధ వ్యాపారాలు నిర్వహిస్తు లాభాల బాటలో పయనిస్తున్నాయన్నారు. వ్యాపారాలు చేయడానికి సంఘాలు ముందుకు వస్తే అవసరమైన రుణాలను ప్రభుత్వ పరంగా అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. కేడీసీసీబీ డైరెక్టర్ డి మోహన్ రావు మాట్లాడుతు సకాలంలో అన్ని సీజన్‌లో రైతులకు రుణాలు అందజేస్తూ వారికి అదనంగా సేవలందిస్తున్నామని, సకాలంలో రుణాలు రికవరీ చేస్తున్నామన్నారు. ప్రతీ గ్రామంలో గోదాము లను నిర్మించామని వాటి ద్వారా ఆయా గ్రామాల రైతులకు ఎరువులను అందుబాటులలో ఉంచుతున్నామ న్నారు. డీసీఓ శ్రీమాలను పాలకవర్గం సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణ రావు, ఐటీసీ అధికారి ఆకాశ్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, కేడీసీసీ మేనేజర్ శశిధర్‌రావు అబ్దుల్‌షమీ,సీఈఓ వల్లంకొండ రమేష్, సంఘం ఉపాధ్యక్షుడు కందుల రాజు, డైరక్టర్లు మాధవ్‌రావు, లింగయ్య, సత్తయ్య, వీరయ్య, నిర్మల, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పలు సంక్షేమ పథకాలు అమలు చేసిన వైఎస్సార్



వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సుల్తానాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత డాక్టర్ రాజశేఖర్ రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. నారాయణపూర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కేక్ కట్ చేసి కార్యకర్తలకు నాయకులు పంచారు. ఏఎంసీ చైర్మన్ ప్రకాష్‌రావు, మండల రమేష్, పన్నాల రాములు, సతీష్, అబ్బయ్య, కొండల్ రావు, కుమార్, పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ప్రాణదాత వైఎస్ఆర్ అని కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి అన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నజీమోద్దీన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌కు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యానికి పెద్దపీట వేశారని, రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారన్నారు. పేదలకు ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు స్కాలర్‌షిప్‌ల ద్వారా ఎందరో విద్యార్థుల చదువుకు తోడ్పాడ్డారన్నారు. కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, గుడికందుల శివ, గడ్డం శ్రీనివాస్, చుక్కల శ్రీనివాస్, గట్ల రమేష్, కౌటం సతీష్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. తెలంగాణ చౌరస్తాలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచారు. పట్టణాధ్యక్షుడు రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డి, నాయకులు జక్కుల దామోదర్‌రావు, చాట్ల సదానందం, చక్రపాణి, అనుము రాములు, పాల్గొన్నారు. ఓసీపీ-1 ప్రాజెక్టులో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి జయంతి నిర్వహించారు. ఐఎన్‌టీ యూసీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. గంధం శ్రీనివాస్, నాగరాజు, లక్ష్మణచారి, కృష్ణ మూర్తి, రాయలింగు, మల్లన్న, కుమారస్వామి పాల్గొన్నారు.

ముత్తారం, (ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామగిరి(ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలోని ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతిని కాంగ్రెస్ శ్రేణులు జరుపుకున్నారు. నాయకులు తోటచంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆరెల్లిదేవక్క, కొంరయ్యగౌడ్, కాటంసత్యం, నీరజ, తులసిరాంగౌడ్, మైదంభారతి వరప్రసాద్, ముస్త్యాలశ్రీనివాస్, పాల్గొన్నారు.

అంతిమ సంస్కారాలకు నీరు ఇవ్వలేదని ఫిర్యాదు



సమస్యను ఎంపీడీవోకు వివరిస్తున్న బాధితులు

కమాన్‌పూర్, జూలై 8(ఆంధ్రజ్యోతి): కేశవనగర్‌లో జంగపల్లి నర్సమ్మ మృతి చెందగా అంత్యక్రియల అనంతరం స్నానాలకు గ్రామపంచాయతీ సిబ్బంది నీటి సదుపాయం ఏర్పాటు చేయలేదని మృతురాలి బంధు వులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో కార్యాలయానికి చేరుకున్నారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి వెళ్లిపోయినట్లు వారు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంకు వెళ్లి జరిగిన సంఘటనను నర్సమ్మ కుమారుడు అజయ్ వివరించారు. ఎంపీడీఓ వివరాలు తీసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. శ్రీనివాస్, సది, అనిల్, తిరుపతి, శ్రీనివాస్, వెంకటేష్ సాయి ఉన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఏర్పాటు

జూలపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు సూచన మేరకు నియమించారు. ఉపాధ్యక్షులుగా మెండె రాజన్న, లక్కాకుల రమేష్, పొన్నం వెంకటేశం, బొజ్జ రమేష్, ప్రధాన కార్యదర్శులుగా బొజ్జ సంపత్, బడుగు శ్రీనివాస్, కార్యదర్శులు వేల్పుల రాంమూర్తి, నగునూరి సురేష్, దాడి లక్ష్మన్, కొమ్మ మహెందర్, కోశాధికారిగా ఆవుల రాజు నియమించారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మేర్గు నరేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన పదవికి వన్నె తెచ్చే విధంగా పార్టీ ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు మండలంలో పార్టీ అభివృద్ధి నిరంతరం పాటు పడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

వ్యాధులబారిన పడకుండా చర్యలు

కోల్‌సిటీ, జూలై 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రామగుండం నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి ప్రజలకు సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మంగళవారం ఎల్కపల్లిగేట్ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయించారు. ఎల్కలపల్లి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. ప్రజలు దోమ తెరలు వాడడం, కిటికీలకు జాలీలు బిగించుకోవాలన్నారు. శివాజీనగర్ కూరగాయల మార్కెట్‌లో మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించిన అనంతరం గాంధీచౌరస్తా నుంచి రామాలయం రోడ్‌లో వ్యాపారు లకు ట్రేడ్ లైసెన్స్‌లపై అవగాహన కల్పించారు. అనంత రం పీకే రామయ్య కాలనీలో వన మహోత్సవంలో పాల్గొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కుమారస్వామి, కిరణ్, హెల్త్ అసిస్టెంట్ సంపత్, వార్డు అధికారులు సాయి, గంగయ్య, శ్రీనివాస్, శానిటరీ సూపర్‌వైజర్లు ఆడెపు శ్రీనివాస్, అశోక్, యూసుఫ్, సతీష్, రాజేశం, శంకర్, సీఓలు శ్వేత, శమంత, ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఘనంగా మహిళా శక్తి సంబరాలు



జూలపల్లిలో ఇందిరా మహిళా శక్తి సంబురాలు

ఓదెల, జూలై 8(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయం వద్ద మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వం మహిళకు వడ్డీ లేని రుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాలను, బీమా సౌకర్యం, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, మార్కెట్లలో కేంద్రాల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. డిపిఎం సంజీవ్, ఏపీఎం లతా మంగేశ్వరి, మండల సమైక్య అధ్యక్షురాలు ఆలేటి స్వప్న, సీసీలు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): వెలుగుదీప్తి సమైక్య కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి సంబురాలను నిర్వహించారు. డిపిఎం సంజీవ్ మాట్లాడుతూ సంఘాల సభ్యులకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిం చాలని సూచించారు. ఏపిఎం పద్మ, సిసిలు మల్లేశం, శ్రీదర్‌స్వామి, లక్ష్మి, జ్యోతి మండల సమైక్య సిబ్బంది పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సంబరాల సమావేశాన్ని అధ్యక్షురాలు శిరీష అధ్యక్షతన నిర్వహిం చారు. ఇందిరా మహిళా బస్, మహిళా క్యాంటీన్, పెట్రో ల్ బంక్, సోలార్ యూనిట్లు, వడ్డీ లేని రుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాలలు విషయాలపై వివరించారు. డీపీఎం వెంకటరమణ, ఏపీఎం శైలజ, శాంతి, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొనవద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని, జూలై 8(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెకు సంబంధించి సింగరేణి పరిధిలో ఒక అంశం కూడా లేదని, పరిధిలో లేని అంశాలపై సమ్మె చేస్తే ప్రయోజనం ఏమిటని, కార్మికవర్గం సమ్మెకు దూరంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్లు కోరారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్ (పా) గౌతం పొట్రు, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్లు అన్నీ ఏరియాల జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల అధికారులతో సమా వేశం నిర్వహించారు. కార్మికులకు సమ్మె పరిణామాలపై వివరించాలని వారు సూచించారు. ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం జూలైలో వెనుకబడే అవకాశం ఉందన్నారు. సింగరేణిపై విద్యుత్ సంస్థలు ఆధారపడి ఉన్నాయని, ఒక్క రోజు సమ్మె చేస్తే సింగరేణికి ఉత్పత్తి నష్టం రూ.76కోట్లు ఉంటుందని, కార్మికులు కూడా రూ.13.7కోట్ల వేతనాలు కోల్పోతారని, ఒక రోజు 1.92 లక్షల టన్నుల ఉత్పత్తికి కూడా నష్టం జరుగుతుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 72మిలియన్ టన్నులు లక్ష్యంగా ఏర్పర్చుకుంటే జూలై 1వ తేది వరకు కేవలం 22.4శాతం మాత్రమే ఉత్పత్తి జరిగిందని, ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సమ్మె ఆలోచనను విరమించి కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు. జీఎం లలిత్‌కుమార్, ఎస్ఓటూ జీఎం ఆంజనేయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 పరిధిలోని ఉద్యోగులు సమ్మె కు దూరంగా ఉండాలని జీఎం బండి వెంకటయ్య ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె డిమాండ్లలో సింగరేణి ఉద్యోగులకు సంబంధించినవి పెద్దగా లేవని, యాజమాన్యం తీర్చగలిగిన డిమాండ్లు కావని తెలిపారు. ఉద్యోగులు విధులకు హాజరు కావాలని జీఎం విజ్ఞప్తి చేశారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మె దూరంగా ఉండాలని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు కార్మికులకు పిలుపు నిచ్చారు. సమ్మె వల్ల కలిగే ఉత్పత్తి అంతరాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు శేఖర్‌బాబు, రామ్మోహన్, వెంకటరమణ, రాజశేఖర్, ప్రవీణ్, కాశీవిశ్వేశ్వరరావు, పాల్గొన్నారు.



నేటి సమ్మెను విజయవంతం చేయాలి



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చడానికే నాలుగు లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టిందని, నియంతలా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే బుధవారం దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. సింగరేణిలో సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కార్మికులను కోరారు. మంగళవారం జీడీకే 2ఏ ఇంక్లైన్, వర్క్‌షాప్‌ల్లో గేట్ మీటింగ్‌ల్లో జేఏసీ సంఘాల నాయకులు సదానందం, తుమ్మల రాజారెడ్డి, రాజిరెడ్డి, కట్ట విశ్వనాథం మాట్లాడారు. కార్మికవర్గాన్ని పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోషం, కారంపురి వెంకన్న, సాయన్న, శ్రీరాములు, చంద్రమోహన్, రాజకిశోర్, రాజేందర్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా బుధవారం జరిగే సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జీఎం ఆఫీస్, ఓసీపీ-3 కృషి భవన్‌లో నాయకులు గేట్‌మీటింగ్‌లు నిర్వహించారు. కేంద్రం 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా సవరించడాన్ని కార్మిక వర్గం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈచట్టాలు అమలులోకి వస్తే కార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతారని, 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతారని, విధి నిర్వహణలో ఏదైన ప్రమాదం జరిగితే ఆర్థిక భద్రత ఉండబోదని తెలిపారు. గేట్ మీటింగ్‌లో జిగురు రవీందర్, రాజారత్నం, శ్యాంసన్, అన్నారావు, శంకర్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, కుంట ప్రవీణ్, మాదాసు రామ్మూర్తి, బేతి చంద్రయ్య పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు 4వ జోన్‌లో గేట్‌మీటింగ్ నిర్వహించారు. కాంట్రాక్టు కార్మికులు సైతం సమ్మెలో పాల్గొనాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు నరేష్ పిలుపునిచ్చారు. గేట్ మీటింగ్‌లో బీ అశోక్, గట్టయ్య, రాయమల్లు, బుచ్చమ్మ, లింగయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, పారిశ్రామిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సింగరేణి కార్మికవర్గం జరిగే సమ్మెలో పాల్గొనాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రైతు ఉద్యమాల స్ఫూర్తితో దేశంలో కార్మిక సంఘాలన్నీ ఐక్య ఉద్యమాలను తీవ్రతరం చేయాలని అన్నారు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దీర్ఘకాలిక ఉద్యమాలే మార్గమని చెప్పారు. ఐ కృష్ణ, పోగుల శేఖర్, ఏడుకొండలు, ఈ నరేష్, మాతంగి రాయమల్లు, బీ అశోక్, ఐ రాజేశం పాల్గొన్నారు.



కృషిభవన్ గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆర్‌జీ-1 అధ్యక్షుడు ఎంఏ గౌస్ కోరారు. జీడీకే ఓసీపీ-5లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే ఈ సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్థులు



టవర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

ముత్తారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎయిర్‌టెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు వచ్చిన అధికారులను గ్రామస్థులు అడ్డుకున్నారు. టవర్ నిర్మిస్తే రేడియేషన్‌తో ప్రజలు వ్యాధులబారిన పడతారన్నారు. టవర్ నిర్మాణానికి అనుమతులు ఉన్నా ఇంటి వద్దకు అధికారులు పోలీసు బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. గ్రామస్థులు అడ్డుకోవడంతో అధికారులు అక్కడినుండి వెళ్ళిపోయారు. గ్రామంలో టవర్ నిర్మిస్తే రేడియేషన్ వల్ల వ్యాధులకు గురవుతామని గ్రామశివారులో టవర్ నిర్మించాలని వారు అధికారులను కోరారు.

ఉపాధిహామీ కూలీలకు శిక్షణ తరగతులు

ముత్తారం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ కూలీలకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా డీఆర్డీవో కాళిందిని హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో 100రోజుల పనిదినాలు పూర్తిచేసుకున్న వారితోపాటు జాబ్‌కార్డులేని వారికి కూడా ఉచితంగా శిక్షణను అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీడీవో సురేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థి

రామగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన మౌటం కీర్తన బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ అబ్బుకేశవరెడ్డి విద్యార్థిని అభినందించారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ

రామగిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిల్స్‌ను మంగళవారం పంపిణీ చేశారు. మారుతీనగర్‌కు చెందిన స్వర్గీయ సౌమిత్రి నారయణ చార్యుల జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తిరుమలాచార్యులు నోట్ బుక్కులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు దేవళ్ళ వనజ, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుంట వెంకటేశం, గుండేటి సత్యనారాయణ, మల్లారం శంకర్, ఆడేపు రవి, పిఈటి దేవేందర్‌లు పాల్గొన్నారు.

17న రైల్‌రోకో విజయవంతం చేయాలి

పెద్దపల్లిటౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 17న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన రైల్‌రోకో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాగృతి జిల్లా అధ్యక్షుడు పెంట రాజేష్ పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరించిన అనంతరం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ 42 శాతం పెంపు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఈ పోరాటం చేయనున్నట్లు తెలిపారు. జాగృతి జిల్లా అధికార ప్రతినిధి అద్దె సదానందం మాట్లాడుతూ రాజ్యాధికారం లక్ష్యంగా బీసీల అభ్యున్నతికి ప్రతీ ఒక్కరు కలిసి రావాలన్నారు. పోల్సాని హారిక, బొల్లం భూమేష్, బొగ్గుల సాయి కృష్ణ, తోట హరీష్ గౌడ్, సకినాల ప్రతాప్, సలేంద్ర కొమురయ్య, పాల్గొన్నారు.

అవసరానికి మించి యూరియా వాడవద్దు

ఎలిగేడు, జూలై 8(ఆంధ్రజ్యోతి): యూరియాను అవసరానికి మించి వాడితే భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల మొక్కకు కావాల్సిన పోషకాల సమతుల్యత దెబ్బతిని, సూక్ష్మపోషకాల లోపాలు అధికమవుతాయని తెలిపారు. భూగర్భ జలాలు నైట్రేట్, నత్రజనితో కలుషితమవుతూ నేలలో ఉండి పంటకు మేలు చేసే సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుందన్నారు. యూరియా తగ్గించి ప్రత్యామ్నాయంగా నానో యూరియాను ఎకరానికి 500 మిల్లీలీటర్ల చొప్పున పురుగు మందులు, శిలీంద్రనాశనీలతో కలిపి పిచికారి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏఈఓలను సంప్రదించాలని ఆయన సూచించారు.

రైల్వే సమస్యలపై జీఎంకు వినతి

పెద్దపల్లి రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లో కరోనా కాలం నుంచి ఎలాంటి రైళ్ల ఆపడం లేదని, భాగ్యనగర్, ప్యాసింజర్ రైళ్లను నిలుపాలని దక్షిణ మధ్య రైల్వే జీఎంకు గ్రామ యువకులు వినతిపత్రం అందించారు. 36వ గేట్ మూసివేయడం వల్ల ఎస్సీ కాలనీ, తెనుగుపల్లి విద్యార్థులు సుమారు 3 కిలోమీటర్లు తిరిగి పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని, రైతులకు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. బాలసాని క్రాంతి లెనిన్, పెర్క రాజేందర్, బొబ్బిలి రాకేష్‌లతో పలువురు పాల్గొన్నారు.

కేయూలో జిల్లావాసులకు గోల్డ్‌మెడల్స్



గోల్డ్‌మెడల్ అందుకున్న కవిత, శృతి

కాల్వశ్రీరాంపూర్/ముత్తారం, జూలై 8(ఆంధ్రజ్యోతి): తారుపల్లి గ్రామానికి చెందిన రామగుండం కవిత కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ హన్మకొండలో మనోవిజ్ఞాన శాస్త్రం సైకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. అలాగే ముత్తారం మండలం మచ్చుపేటకు చెందిన వర్మణి శృతి ఎంఏ తెలుగు అభ్యసించింది. వీరు యూనివర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.

ఖర్జూర మొక్కలు నాటిన గీత కార్మికులు



ఓదెల లో ఖర్జూర మొక్క నాటుతున్న రవి

ఓదెల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గీత పారిశ్రా మిక సహకార సంఘం అధ్యక్షుడు నాగపురి రవి గౌడ్, ఖర్జూరం మొక్కలు నాటారు. రవి మాట్లాడుతూ, గీత కార్మికులకు భవిష్యత్తులో ఖర్జూర జీవనోపాధిగా మారనున్నదని, ఎమ్మెల్యే విజయ రమణారావుకు తెలుపగా మొక్కలు తెప్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ ఎస్ఐతోపాటు ముంజాల మహేందర్ గౌడ్, చింతల పరుశురామ్ గౌడ్, పచిమట్ల స్వామి, గట్టు అనిల్, పోతుగంటి వెంకటేష్, భూసారపు రాకేష్, మార్క చందు, కాసారపు రాజు, పోతుగంటి అజయ్, అమడ గోని కుమార్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం బస్సు ప్రారంభించిన డీఎం

మంథని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ప్రయాణికులతో వెళ్ళిన బస్సును డీఎం శ్రావణ్‌కుమార్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ మీదుగా బస్సు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం బుధవారం రాత్రి అరుణా చలం చేరుకుంటుందన్నారు. గురువారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా జరిగే గిరి ప్రదక్షణ అనంతరం గురువారం రాత్రి బస్సు బయలుదేరి ఈనెల 11న గద్వాల జోగులాంబ టెంపుల్ దర్శనం అనంతరం తిరిగి మంథనికి చేరుకుంటుందన్నారు.